ప్రమాదపుటంచున పసిప్రాణాలు!

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేయని గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లు
- భోజనం తయారీలో సిబ్బందికి తప్పని ఇక్కట్లు
- కొత్త పరికరాలు ఇవ్వాలని డిమాండ్


అంగన్‌వాడీ సెంటర్‌లోని చిన్నారులు


పని చేయని కుక్కర్

తాడిపత్రి రూరల్: కూటమి ప్రభుత్వ నిర్వాకంతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు ప్రమాదపుటంచుల్లో ఉన్నారు. కేంద్రాల్లోని గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లు సరిగా పని చేయకపోవడంతో ఏక్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోన్న భయం ఇటు అంగన్‌వాడీ టీచర్లు, అటు చిన్నారుల తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 302 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. ఇందులో 5800 మంది చిన్నారులు, 3600 మంది బాలింతలు, గర్భిణులు ఉన్నారు. గర్భిణులు, బాలింతలకు టేక్‌హోం రేషన్ అందిస్తున్నారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం, కోడిగుడ్డు ఉడకబెట్టి అందిస్తుంటారు. ఇందుకోసం గత ప్రభుత్వం గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లు సరఫరా చేసింది.

కొరవడిన నిర్వహణ..

అంగన్‌వాడీ కేంద్రాలకు అందించిన గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లకు నిర్వహణ కొరవడటంతో సరిగా పని చేయడం లేదు. చాలా చోట్ల పరికరాలు మూలనపడ్డాయి. కొందరు సిబ్బంది మాత్రం సొంత డబ్బు వెచ్చించి మరమ్మతులు చేయించుకుంటున్నారు. వీటి స్థానంలో కొత్త వాటిని మంజూరు చేయాలని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఉన్నతాధికారుల ప్రతిపాదనలు పంపామని చెపుతున్నా ఫలితం లేదని కొందరు అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన చెందుతున్నారు. మరమ్మతులకు గురైన వాటిని ఉపయోగించి వంట చేయడం వల్ల అవి పేలి ఎంతటి ప్రమాదాలు సంభవిస్తాయన్న భయం వారిలో ఉంది. అరకొరగా వచ్చే జీతంతో నెలల తరబడి రానీ సెంటర్ల బాడుగలు, కూరగాయల ఖర్చు, ఈవెంట్ల పేరుతో చేతి నుంచి మరికొంత మొత్తాలను ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆర్థికంగా చితికి పోయిన టీచర్లు కొందరు అరకొరగా రిపేరీ చేయించి తిరిగి ఉపయోగిస్తున్నారు. గ్యాస్ స్టౌవ్‌లను మరమ్మతులు చేయించినా పైపులు, రెగ్యులేటర్లను మాత్రం రూ.వందలు ఖర్చు చేసి కొత్తవి కొనుగోలు చేస్తున్నారు.

గ్యాస్ స్టౌవ్‌లు, కుక్కర్లు పంపిణీ చేయాలి



అంగన్‌వాడీ సెంటర్లలో మరమ్మతులకు గురైన గ్యాస్ స్టౌవ్‌లు, కుక్కర్ల స్థానంలో కొత్త వాటిని మంజూరు చేయాలి. దీనిపై ఇటీవల అంగన్‌వాడీ టీచర్లతో కలిసి సీడీపీఓకు వినతి పత్రం అందజేశాం. ఇప్పటికే పరికారల మరమ్మతు కోసం రూ.వందలు ఖర్చు చేశాం.

– గోవిందమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కోశాధికారి


మూలనపడిన గ్యాస్ స్టౌవ్

సూపర్‌వైజర్‌తో సర్దుపై చేసుకోండి



తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో దెబ్బతిన్న గ్యాస్ స్టౌవ్‌ల స్థానంలో కొత్త వాటిని మంజూరు చేసేందుకు సూపర్‌వైజర్లతో అంగన్‌వాడీ టీచర్లు సర్దుపై చేయించుకోవాలి. అనంతరం వాటి గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. ప్రాజెక్టు పరిధిలో పనికి రాని స్టౌవ్‌లు, కుక్కర్లు ఎన్ని ఉన్నాయో వివరాలను సేకరించాలని సూపర్‌వైజర్లకు తెలియజేస్తాం.

–సాజిదా బేగం, సీడీపీఓ

క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుధ్య పనులు


ఉప్పర వీధిలో డ్రైనేజీలో పూడిక తీస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మర వీధి, ఉప్పర వీధి, ఓల్డ్ సీపీఐ కాలనీ, ఓల్డ్ సీఐ బంగ్లా తదితర ఏరియాల్లో అధికారులు బుధవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. మున్సిపాలిటీలో నెలకొన్న అపరిశుభ్రతపై బుధవారం సాక్షి దినపత్రికలో 'ఎక్కడ చూసినా చెత్తే' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా ఆయా ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టారు.

గుత్తిలో పునరావాస కేంద్రాల ఏర్పాటు


పునరావాస కేంద్రాలకు రావాలని కోరుతున్న అధికారులు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు మూడు తాత్కాలిక పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. గుత్తిలోని కోట ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల అదే విధంగా గుత్తి ఆర్ఎస్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలను వసతి ఏర్పాటు చేశారు కొండలు సమీపం శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసమున్న 10 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి మున్సిపల్, సచివాలయ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ప్రయత్నించారు. అయితే కేంద్రాల్లో సౌకర్యాలు లేకపోవడంతో జనాలు వెళ్లడానికి నిరాకరించారు. పది కుటుంబాల వారు తమ బంధువుల ఇళ్లకు వెళ్లారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్

గుంతకల్లుటౌన్: ఈ నెల 18న విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ కోరారు. బుధవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ పట్టణ అధ్యక్షుడు హనుమంతు, నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, బాష, నారాయణ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాల్మీకి మహర్షి జయంతి

పామిడి: పట్టణంలో గురువారం వాల్మీకి మహర్షి మండల కమిటీ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆసంఘం అధ్యక్షుడు ఎం ఎన్ ఈశ్వరయ్య బుధవారం తెలిపారు. వేడుకల్లో భాగంగా వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుందన్నారు. మండలవ్యాప్తంగా ఉన్న వాల్మీకులు పెద్దెత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అన్న క్యాంటీన్ ప్రారంభం


అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయరామ్

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను బుధవారం స్థానిక ఎమ్మెల్యే జయరామ్ ప్రారంభించారు. ప్రజలకు భోజనాలు వడ్డించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం ఎమ్మెల్యే జయరామ్ జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. చైర్‌పర్సన్ భవానీ, మున్సిపల్ కమీషనర్ నయీమ్ అహ్మద్, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, ఇంజనీర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: స్థానిక జెడ్పీఅతిథి గృహంలో ఏర్పాటు చేసిన డీఎల్‌డీఓ కార్యాలయాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం ప్రారంభించారు. నెట్టికంటి ఆంజనేయ స్వామి ఫోటో జ్ఞాపికను ఆయనకు అందజేశారు. డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీకాంత్ చౌదరి, ఎంపీపీ బీపీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులకు 40 దరఖాస్తులు

శింగనమల: స్థానిక కేజీబీవీలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులకు 40 దరఖాస్తులు వచ్చినట్లు ఎంఈఓ నరసింహారాజు తెలిపారు. హెడ్ కుక్ పోస్టుకు ఏడుగురు, అసిస్టెంట్ కుక్‌కు 12 మంది, నైట్ , డే వాచ్‌మెన్‌లకు ఏడుగురు స్వీపర్లకు 8 మంది, చౌకీదారు పోస్టులకు ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

తడి చేతులతో విద్యుత్ పరికరాలు తాకొద్దు

గుత్తి: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశముందని, ప్రజలెవరూ తడి చేతులతో విద్యుత్ పరికరాలు తాకొద్దని ట్రాన్స్‌కో డీఈ ప్రజలకు సూచించారు. పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగల కింద ఉండరాదన్నారు. ఇళ్లలో అసరమున్నపుడు తప్ప మిగతా సమయాల్లో విద్యుత్ స్విచ్‌లను ఆఫ్ చేసి ఉంచాలన్నారు. రైతులు విద్యుత్ మోటార్లను ఆన్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ మోటార్లు , స్టార్టర్లు రిపేరీకి ప్రయత్నించవద్దన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

తాడిపత్రి అర్బన్: అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి పలికి సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ పి.రామకృష్ణుడు సూచించారు. బుధవారం రాత్రి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో మట్కా బీటర్లు, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా మట్కా బీటర్లు మట్కాకు స్వస్తి పలికాలని లేకుండా పట్టణ బహిష్కరణ తప్పదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ప్రజా సమస్యల పరిష్కరించాలని సర్పంచ్, ఎంపీటీసీలు అధికారులను కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మూడు నెలల్లో జరిగిన ప్రగతి, ప్రతిపాదనలను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఏఓ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ పీఎం కిసాన్ జమకాని రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. గ్రామాల్లో భారీగా కురిసిన వర్షాలకు పంట నష్టం జరిగి ఉంటే నమోదు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని పరిష్కరించాలని సర్పంచ్‌లు కోరారు. పలు గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, సర్పంచ్‌లు చిన్న ఆంజనేయులు, రమేష్, పాపన్న, వెంకటేష్, ఎంపీటీసీలు చిన్న వీరన్నగౌడ్, లాలెప్ప, సుమలత, శంకరమ్మ, కార్యదర్శులు ధనలక్ష్మి, వెంకటేష్, ఏపీఓ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మంజునాథ్ పాల్గొన్నారు.

అనస్తీషియా వైద్యుల పాత్ర కీలకం


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అనస్తీషియా విభాగం వైద్యులు

అనంతపురం మెడికల్: రోగుల ప్రాణాలు కాపాడటంలో అనస్తీషియా వైద్యులది కీలకపాత్ర. గత కొన్నేళ్లుగా ఆస్పత్రిలో జరిగిన వేల సర్జరీల విజయవంతంలో అనస్తీషియా వైద్యుల భాగస్వామ్యం ఉంది. ఇదే స్ఫూర్తితో రోగులకు నాణ్యమైన సేవలందిద్దామని ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ కుమార్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ అనస్తీషియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకూ ర్యాలీ సాగింది. అనంతరం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని అనస్తీషియా విభాగంలో ఈథర్ మత్తు మందును కనుగొన్న శాస్త్రవేత్త మోర్టన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లో 1846లో శాస్త్రవేత్త మోర్టన్ మత్తు మందును కనుగొన్నారన్నారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. శస్త్రచికిత్స సమయంలో మత్తు మందు ఇవ్వడమే కాకుండా రోగులకు ఆపద సమయంలో, దీర్ఘకాలిక నొప్పులు, తదితర సమస్యలకు అనస్తీషియా ద్వారా ఉత్తమ సేవలందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో అనస్తీషియా వైద్యులు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ జగదీష్, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ పద్మాబాయి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ


అన్నదానం చేస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

అనంతపురం: పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లోని మహబూబ్ సుబహానీ దర్గాలో బుధవారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ హాజరై ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయా మతాలకు సంబంధించిన ముఖ్యమైన పర్వదినాలు జిల్లా పోలీసు శాఖ ఘనంగా నిర్వహిస్తుండటం గర్వకారణమన్నారు. పోలీసు కుటుంబాలే కాకుండా నగర ప్రజలు అందరూ సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, ఏఆర్ అడిషనల్ ఎస్పీ మునిరాజ, డీఎస్పీలు వి. శ్రీనివాసరావు, రవికుమార్, మహబూబ్ బాషా, సీఐలు క్రాంతి కుమార్, శ్రీకాంత్, శాంతిలాల్, రామకృష్ణా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఇస్మాయిల్, దేవానంద్, ఆర్‌ఐలు రెడ్డప్ప రెడ్డి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి నేలకూలిన ఇల్లు


గుత్తి చెర్లోపల్లి కాలనీలో వర్షానికి కూలిన ఇల్లు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లి కాలనీలో బుధవారం వర్షానికి రహమత్ బి అనే మహిళకు చెందిన ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో ఇంటి లోపల ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. నష్టపరిహారం అందించి తనను ఆదుకోవాలని బాధితురాలు ప్రభుత్వాన్ని కోరారు.

పుట్లూరు: మండలంలోని చింతకుంట గ్రామంలో హనుమంతు అనే వ్యక్తికి చెందిన ఇంటిపై కప్పు బుధవారం వర్షం కారణంగా కూలిపోయింది. ఆ సమయంలో హనుమంతు కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఈ ప్రమాదం వల్ల వంట సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

పామిడిలో మోస్తరు వర్షం

పామిడి: తుపాన్ ప్రభావంతో మండలంలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటలకు వర్షం విడకుండా కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు పారడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

గార్లదిన్నె: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఈరమ్మ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కంట్రోల్ రూంలో మూడు షిఫ్టులుగా సిబ్బంది పని చేస్తారన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నియోజకవర్గంలోని చెరువులు నింపాలి

శింగనమల: పీఏబీఆర్ కుడికాలువ ద్వారా శింగనమల నియోజకవర్గంలోని సిద్దరాంపురం, ఏడావులపర్తి, నార్పల మండలం దుర్గం, బి.పప్పూరు చెరువులను నింపాలని సీపీఎం నాయకుడు ఓ.నల్లప్ప కోరారు. బుధవారం ఆయన సీపీఎం బస్సుయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈనెల 18న బుక్కరాయసముద్రం, వెంకటాపురం, రెడ్డిపల్లి , కొర్రపాడు మీదుగా బస్సు యాత్ర సాగుతుందన్నారు. బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, నాయకులు సంజీవరెడ్డి, నెట్టికంటయ్య, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : జిల్లాలో సాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం చేపట్టిన బస్సుయాత్ర ను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి దస్తగిరి కోరారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం బస్సుయాత్ర చిట్టూరులో ప్రవేశిస్తుందని, పెద్దవడుగూరు మీదుగా క్రిష్టిపాడు గ్రామానికి చేరుకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతాం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రావణి

గార్లదిన్నె: పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి పేర్కొన్నారు. బుధవారం ముంటిమడుగు కొత్తపల్లిలో ఉపాధి హామీ కింద రూ.49.5 లక్షలతో తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసు నమోదు

యాడికి: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని పచ్చారుమేకలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన రంగస్వామి తమ్ముడు రాఘవేంద్ర అదే కాలనీకి చెందిన కల్యాణ్, కిశోర్ వెంట కొంత కాలంగా తిరుగుతున్నాడు. దీంతో ఆ ఇద్దరి వెంట తిరగొద్దని రంగస్వామి తన తమ్ముడిని మందలించాడు. ఈ విషయం తెలుసుకున్న కల్యాణ్, కిశోర్ తమ తండ్రి కంబగిరి రాముడుతో కలిసి బుధవారం రంగస్వామిపై దాడి చేశారు. రంగస్వామి తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కంబగిరి రాముడు, కల్యాణ్, కిశోర్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శింగనమలకు దారి ఏర్పాటు చేయండి


శింగనమల మరువకొమ్మ వద్ద రాస్తారోకో చేస్తున్న దృశ్యం

శింగనమల: అనంతపురం –విజయవాడ జాతీయ రహదారి(544–డీ) నుంచి శింగనమలకు దారి ఏర్పాటు చేయాలని శింగనమలకు చెందిన ప్రజలు బుధవారం మరువకొమ్మ క్రాస్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శింగనమలకు వచ్చేందుకు బ్రిడ్జి నిర్మించకుండా రోడ్డు వేశారన్నారు. ఆరోడ్డు మీదకు చేరాలంటే ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. మరోవైపు రోడ్డు పనులతో అనంతపురం–తాడిపత్రి వైపునకు వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలపకుండా పోతున్నారన్నారు. అనంతపురం–తాడిపత్రికి వెళ్లే ప్రతి ఆర్టీసీ బస్సు శింగనమల క్రాస్‌కు వచ్చి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో చేస్తున్న వారితో సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్‌చంద్ర మాట్లాడారు. అనంతరం వారు తహసీల్దార్ బ్రహ్మయ్యతో చర్చించారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

దేవరపల్లిలో 'పల్లె పండుగ'


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ తేజోత్స్న

పామిడి: దేవరపల్లిలో బుధవారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు, ఎంపీడీఓ కే తేజోత్స్న, ఈఓఆర్డీ కృష్ణకుమార్ గ్రామంలో రూ.20 లక్షలతో తలపెట్టిన వివిధ అభివృద్ధి పనులకు వారు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వై సూర్యనారాయణ, వీఆర్వో సునిత బాయి, పంచాయతీ కార్యదర్శి మునీంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : పి.వీరన్నపల్లి, కొట్టాలపల్లి, దిమ్మగుడి గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బారెన్‌సాహెబ్, ఏపీఓ పుల్లారెడ్డి ప్రజా ప్రతినిధులు కలిసి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

నార్పల: మండలంలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్తపై మంగళవారం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాలు.. రెండు రోజుల క్రితం తాగునీటి విషయమై కురగానపల్లి,వెంకటాంపల్లి గ్రామాల రైతుల మధ్య చిన్న పాటి వాగ్వాదం జరిగింది. ఈ ఘటనలో వెంకటాంపల్లి గ్రామానికి చెందిన రైతు రఫీ స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణీని అసభ్యకరంగా మాట్లాడినట్లు పలువురు టీడీపీ కార్యకర్తలే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రైతుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

సీపీఆర్‌పై అవగాహన

అనంతపురం: సీపీఆర్ ద్వారా ఆగిన గుండె, ఊపరితిత్తులను మళ్లీ పని చేసేలా ఎలా చేయొచ్చో డాక్టర్లు డెమో నిర్వహించారు. జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్లు సుబ్రహ్మణ్యం, డాక్టర్ భూషణ్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సౌజన్య తదితరులు పాల్గొని పోలీసులకు అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్లను జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోండి


దోనిముక్కలలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కే.స్వాతి రైతులకు సూచించారు. బుధవారం నెలగొండ, దోనిముక్కల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పంటసాగులో మెలుకువలు, ఎరువుల యాజమాన్యం, నూతన వ్యవసాయ పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షాలు అధికంగా పడుతున్న నేపథ్యంలో పొలాల్లో వర్షపు నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలని ఏఓ రైతులకు సూచించారు.

'అన్యాయం చేస్తే ఆత్మహత్య చేసుకుంటాం'

కూడేరు: కూడేరు పొలం సర్వే నంబర్–535లోని ప్రభుత్వ భూమిలో గత 30 ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నాం. ఆ భూమిలోకి వెళ్లొద్దని నోటీసులు ఇచ్చారు. తమకు అన్యాయం చేస్తే ఆత్మహత్యలు చేసుకుంటామని మండల పరిధిలోని అరవకూరుకు చెందిన రైతులు స్పష్టం చేశారు. సర్వే నంబర్ 535లోని 450 ఎకరాల్లో ఏపీఐఐసీకి 350 ఎకరాలు, ఎంఐజీ లే–అవుట్‌కు 26 ఎకరాలు కేటాయించడం జరిగింది. ఆ భూమిలో పంటలు సాగు చేసుకున్న రైతులు తొలగించుకోవాలని రెవెన్యూ అధికారులు మూడు రోజులు క్రితం నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. బుధవారం సుమారు 30 మంది రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్‌ను కలిశారు. తాము పేదలమని, కొన్నేళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నాం. ఉన్నట్టుండి ఇపుడు మీరు పంటలు తొలగించుకోవాలని చెబితే ఎలా అని ప్రశ్నించారు. మాకు జీవనాధారమైన ఈ భూమిని మీరు తీసేసుకుంటే తాము ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. బలవంతంగా భూములను తీసుకుంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు, ధనుంజయ, అలివేలమ్మ, రామాంజనేయులు, గంగాధర్, రాము, ముత్యాలక్క పాల్గొన్నారు.